# ఏపీకి నిధుల వరద..

# తెలంగాణకు బురద

## పార్లమెంటులో గర్జించిన ఎంపీ వద్దిరాజు

- బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని నిలదీసిన ఎంపీ వద్దిరాజు
- విభజన హామీలను గాలికొదిలారని మండిపాటు
- నిధులు తేవడంలో తెలంగాణలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు సహా ఎనిమిది బీజేపీ ఎంపీలు విఫలమయ్యారు..
- కేసీఆర్ సారధ్యంలోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధించిందని సభలో స్పష్టం చేసిన ఎంపీ

వనం నాగయ్య, కెరటం న్యూస్



బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని మంగళవారం పార్లమెంటులో రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ పార్లమెంటు డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పార్లమెంటు సాక్షిగా తనదైన శైలిలో ఆకట్టుకునే ప్రసంగం చేశారు. ప్రధానంగా తెలంగాణకు నిధుల కేటాయింపులో ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదని తన ప్రసంగం ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో బీజేపీ ఎంపీలు, తెలంగాణలోని ఇద్దరు కేంద్ర మంత్రులు నిదులు తీసుకురావడంలో పూర్తిగా విఫలం అయ్యారని మండిపడ్డారు. బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లో మా రాష్ట్రానికి ఏమి దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో, స్వయంపాలన కోల్పోయి తాము అనామకులుగా మారిపోయామని తెలంగాణ ప్రజలు ఆవేదన చెందుతున్నారని పార్లమెంటులో గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు చొరవతో ఆంధ్రప్రదేశ్ కు నిధుల వరద, తమ తెలంగాణకు బురద పారిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఎద్దేవా చేశారు.

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో మంగళవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన జాతీయ బడ్జెట్ పై చర్చలో పాల్గొంటూ తెలంగాణ రాష్ట్ర ప్రజల న్యాయమైన హక్కులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి మరోసారి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ... బడ్జెట్ పై తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు చెప్పారు, ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడవ సారి బడ్జెట్ ను ప్రవేశపెట్టడం అమెకు అభినందనలు తెలిపారు. మా నాయకులు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 14ఏండ్ల పాటు అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. రాష్ట్ర ఏర్పాటు జరిగిన 10ఏండ్లలోనే, అనతి కాలంలో కేసీఆర్ అన్ని రంగాలలో గొప్పగా అభివృద్ధి చేశారని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పార్లమెంటు దృష్టికి తీసు కొచ్చారు. తెలంగాణను దేశానికి ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. తెలంగాణలో నెలకొన్న శాంతి భద్రతలు, ప్రశాంతత, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రోత్సాహంతో దేశ విదేశాలకు చెందిన పెట్టుబడి దారులు ఆకర్షితులై ఎన్నో పరిశ్రమలు నెలకొల్పారని ప్రకటించారు. తమ రాష్ట్రం నుంచి 8మంది బీజేపీ ఏంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలమయ్యారనే భావన ప్రజలలో నెలకొంది. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నిధులు సాధించనట్టయితే.. వారికి ఇవే మొదటి, చివరి గెలుపుగా మిగలనుందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తనదైన శైలిలో సున్నితంగా హెచ్చరించారు. తెలంగాణ ప్రజల ఆరాటం, పోరాటం రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసమే. ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం పట్ల తమ బీఆర్ఎస్ కు, ప్రజలకు ఎటువంటి ఈర్ష్యా ద్వేషాలు లేవు. వాటితో సమానంగా నిధులు రాబట్టలేకపోయిన బీజేపీ, కాంగ్రెస్ ఏంపీలు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని సభాముఖంగా ప్రశ్నించారు. అదే రాష్ట్ర సాధన, ప్రజల అభ్యున్నతినే లక్ష్యంగా, ధ్యేయంగా, అభిమతంగా పుట్టిన పార్టీ నుంచి ఎంపీలు గెలిచి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని స్పష్టం చేశారు. మా ప్రజల న్యాయమైన డిమాండ్స్ పట్ల సానుకూలంగా స్పందించి నిధులు కేటాయించాల్సిందిగా గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ గారికి విజ్ఞప్తి చేస్తున్నట్టు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సభాముఖంగా విన్నవించారు. ప్రధానంగా రాష్ట్ర పునర్విభజన చట్టంలో హామీనిచ్చిన పాలమూరు - రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హెూదా కల్పించి నిధులు కేటాయించాలనీ, మా తెలంగాణలో ఐఐఎం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ ఐ డీ)నెలకొల్పాలనీ, కొత్తగా ఏర్పడిన 23జిల్లాలకు నవోదయ పాఠశాలలు మంజూరు చేయాలనీ, ఐటీఐఆర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపి యువతకు మరిన్ని ఉద్యోగాలు కల్పించాలనీ, సూరత్ తరహా మెగా టెక్స్టైల్ పార్కు నెలకొల్పి చేనేత రంగాన్ని మరింత ప్రోత్సాహించాలి, నేతన్నలను ఆదుకోవాలనీ, సమ్మక్క-సారలమ్మ గిరిజన యూనివర్సిటీకి మరిన్ని నిధులు కేటాయించాలనీ, మా నాయకులు కేసీఆర్ గారు గతంలో పలుమార్లు కోరిన విధంగా రక్షణ భూముల్ని కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించాలనీ, దేశంలోని పేదలకు 3కోట్ల గృహాలను నిర్మించే పథకంలో మా తెలంగాణకు 25లక్షల ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మామూనూరు విమానాశ్రయాన్ని ఆధునీకరించి పౌర విమానాలను ప్రారంభించాలనీ, అయోధ్య తర్వాత ప్రసిద్ధి చెందిన భద్రాచలం రాముల వారి ఆలయానికి కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఉన్న కొత్తగూడెంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేయాలనీ, ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ,బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పలు కీలకమైన డిమాండ్లను సభ దృష్టికి తీసుకెళ్లారు. తన సుదీర్ఘమైన ప్రసంగంతో ఎంపీ ఆకట్టుకున్నారు